సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 1 । డిసెంబర్ । 2022



సైన్స్ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి పోటీలకు పెదబయలు విద్యార్థి నమూనా 8లో

విద్యార్థి కె.మల్లేష్ రూపొందించిన నమూనా రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపికైంది.



ప్రయాణం.. ప్రమాదకరం

ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు వద్ద ద్విచక్ర వాహనాలు, కాలినడకన రాకపోకలకు వీలుగా నిర్మించిన తాత్కాలిక ఐరన్ వంతెన ప్రమాదభరితంగా మారింది. 8లో

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. 8లో

టైగర్ టెర్రర్..!

- నరసాపురం పరిసర ప్రాంతాల్లో గాండ్రింపులను పోలిన శబ్దాలు
- హడలెత్తిపోతున్న నివాసిత ప్రాంతాల ప్రజలు
- రంగంలోకి దిగిన అటవీశాఖ అధికారులు
- కన్నరం రోడ్డులో పాదముద్రలు గుర్తింపు
- నిర్ధారణకు వైల్డ్ లైఫ్ ల్యాబ్‌కు

రంపచోడవరం: పులి గాండ్రింపులను పోలిన శబ్దాలకు గిరిజనులు హడలిపోతున్నారు. రంపచోడవరానికి 18 కిలోమీటర్ల దూరంలోని నరసాపురం నుంచి కన్నరం గ్రామానికి వెళ్లే మార్గంలో మంగళవారం పులి గాండ్రింపులు వినిపించాయని పరిసర ప్రాంతీయులు తెలిపారు. అక్కడ ఒక యువకుడు మంగళవారం రాత్రి తన ఫోన్‌లో గాండ్రింపుల శబ్దాలను రికార్డు చేశాడు. అవి పులి గాండ్రింపులను పోలినట్టుగా ఉన్నాయని పరిసర ప్రాంతీయులు చెబుతున్నారు.

పాదముద్రల సేకరణ

పులి సంచరిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు అటవీ అధికారులు రంగంలోకి దిగారు. కన్నరం రోడ్డులో అక్కడ తిరిగిన జంతువు పాదముద్రలు సేకరించారు. పాదముద్రలు రెండింటిని గుర్తించారు. వీటిలో ఒకటి పెద్దది, రెండవది చిన్నదిగా ఉందని అటవీ అధికారులు తెలిపారు. వీటిని వైల్డ్ లైఫ్ ల్యాబ్‌కు పంపించారు.




పాదముద్రలు గుర్తించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేంజర్ కరుణాకర్, ఇతర సిబ్బంది

ట్రాప్ కెమెరాల ఏర్పాటు

నరసాపురం, కన్నరం, ఊట్ల, రామన్నపాలెం తదితర ప్రాంతాల్లో పులి సంచారంపై అటవీ అధికారులకు సమాచారం వెళ్లడంతో నాలుగు రోజుల క్రితమే కొన్ని చోట్ల ట్రాప్ కెమెరాలను అమర్చినట్లు స్థానికులు చెబుతున్నారు. మారేడుమిల్లి మండలంలోని లోతట్టు ప్రాంతమైన కింటూరు గ్రామంలో ఇటీవల పశువులపై పులి దాడి చేసి తినేసిందని అక్కడ గిరిజనులు తెలిపారు. దీనిపై సోమవారం స్పందనలో రంపచోడవరం ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లారు. పది పశువులపై దాడి చేసిందని గిరిజనులు వినతిపత్రంలో పేర్కొన్నారు. కింటూరు గ్రామం పాపికొండలు నేషనల్ పార్కు దగ్గరలోనే ఉంది. అక్కడ నుంచి ముసురుమిల్లి ప్రాజెక్టు మీదుగా నరసాపురం టేకు ప్లాంటేషన్‌కు రెండు పులులు వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది





గతంలో పాపికొండ నేషనల్ పార్కులో ట్రాప్ కెమెరాకుచిక్కిన పెద్దపులి (ఫైల్), (ఇన్‌సెట్) కన్నరం రోడ్డులో గుర్తించిన పాదముద్రలు

తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో .....: పాపికొండల వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం 2008లో పాపికొండల అభయారణ్యం (నేషనల్ పార్కు)గా ప్రకటించింది. అప్పటి నుంచి జంతు సంరక్షణ కోసం అధికారులు ప్రత్యేక కృషి చేస్తున్నారు. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి జాతీయ పులుల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో గణన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 2018లో నిర్వహించిన సర్వేలో పాపికొండల నేషనల్ పార్కులో పులులు జాడ ట్రాప్ కెమెరాలకు చిక్కాయి. పాపికొండలు అభయారణ్యం 1012.858 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. పులుల సంఖ్య తరువాత మూడేళ్ల కాలంలో పెరిగినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా గోదావరి పరివాహక ప్రాంతంలో గ్రామాలను ఖాళీ చేయడంతో పాపికొండల నేషనల్ పార్కు పరిధిలో జంతువులు స్వేచ్ఛగా తిరిగేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో వాటి సంఖ్య గణనీయంగా పెరిగేందుకు వీలు ఏర్పడి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు.

పాదముద్రలు సేకరించాం

పులి సంచరించినట్లు చెబుతున్న ప్రాంతంలోని పాదముద్రలు సేకరించాం. వాటిలో పెద్ద, చిన్న పాద ముద్రలు ఉన్నాయి. అయితే అవి పులివా కాదా అనేది నిర్ధారణ కావాల్సి ఉంది. అయితే పులి సంచరిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని భావిస్తున్నాం. –కరుణాకర్, రేంజర్, పోక్సుపేట

న్యూస్‌రీల్

పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్ : జిల్లాలో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో వివిధ పరిశ్రమలు నెలకొల్పేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డాక్టర్ వి. పద్మ తెలిపారు. రూ.50 వేల నుంచి రూ.50 లక్షల లోపు ఉత్పత్తి పరిశ్రమలు, రూ.50 వేల నుంచి రూ.20 లక్షల లోపు సేవా రంగ పరిశ్రమలు నెలకొల్పేందుకు వివిధ బ్యాంకులు రుణాలు అందజేస్తాయన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వయసు 18 ఏళ్ల పైబడి కనీసం 8వ తరగతి చదివిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 7396749236, 9441724353 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

పట్టుబడిన వాహనాలకు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న డీవీజీ రాజు

అరకులోయ రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించి స్థానిక ఎక్సైజ్ కార్యలయంలో పాడేరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డీవీజీ రాజు ఆధ్వర్యంలో బుధవారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కేసుల్లో పట్టుబడిన 12 వాహనాలకు వేలం నిర్వహించగా ఏడు వాహనాలకు మాత్రమే పాటదారులు ఆసక్తి చూపినట్టు చెప్పారు. ఏడు వాహనాలకు ప్రభుత్వ ధర రూ.74 వేలు నిర్ణయించగా రూ.1,29,200 ఆదాయం వచ్చినట్టు ఆయన వివరించారు. మిగతా ఐదు ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన వెంటనే నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గణపతిబాబు,ఎస్‌ఐ రమణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం


- హౌసింగ్ పీడీ శ్రీనివాస్



ఇంటిని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ శ్రీనివాస్

రాజవొమ్మంగి: ప్రభుత్వం మంజూరు చేసిన శాశ్వత గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ బీహెచ్. శ్రీనివాస్ సూచించారు.బుధవారం ఆయన మండలంలోని చెరకుంపాలెం, జడ్డంగిలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. తగు సూచనలిచ్చారు. హౌసింగ్‌బిల్లులు ఎప్పటి కప్పుడు వేగవంతంగా జనరేట్ చేస్తున్నామని, వెనువెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులను కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 15,969 ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ గృహాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. వీటిలో 63 శాతం ఇళ్లను మొదలు పెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే రూ. 15.40 కోట్ల మేర పేమెంట్లు సిద్ధం చేశామన్నారు. వీటిలో ఇప్పటికే రూ. 6 కోట్ల మేర లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు ఆయన చెప్పారు. ఒకొక్క ఇంటికి రూ.1.80 లక్షలతో పాటు డ్వాక్రా సంఘాల ద్వారా పావలా వడ్డీపై మరో రూ.35 వేల రుణం అందజేస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 49 లేఅవుట్లు రూపొందించి, 1,700 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సొంత స్థలాలు గల 48 వేల మంది గిరిజనులు తమకు శాశ్వత గృహ నిర్మాణాల మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. డీఈ ఎంవీవీ, నర్సింహరావు, ఏఈ చలపతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామప్రసాద్ పాల్గొన్నారు.

కామేశ్వరరావుకు నివాళి



కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

మోతుగూడెం: విద్యుత్ ఉద్యోగుల శ్రేయస్సు కోసం అప్పటి విద్యుత్ సౌధ (హైదరాబాద్) చైర్మన్ చాంబర్ ముందు ఆత్మార్పణ చేసుకున్న అమరజీవి ఎస్ఏఎస్ కామేశ్వరరావు జయంతిని లోయరు సీలేరు బ్రాంచ్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. రీజనల్ సెక్రటరీ పి.ఆనందబాబు, జెన్‌కో వర్కింగ్ ప్రెసిడెంట్ కె రామకృష్ణ, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి పి.ఆనందబాబు తదితరులు కామేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కామేశ్వరరావు సేవలు మరువలేనివన్నారు.

వారానికొక మండలంలో స్పందన

- రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: డివిజన్‌లోని ఏడు మండలాల్లో వారానికొక మండలంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏలో నిర్వహించే స్పందనకు సమస్యలు తెలిపేందుకు ఎంతో దూరం నుంచి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారానికి ఒక మండలంలో స్పందన నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. వచ్చే సోమవారం (5వ తేదీ) అడ్డతీగల తహసీల్దార్ కార్యాలయంలో స్పందన నిర్వహిస్తామని తెలిపారు. అడ్డతీగల మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలి

- డైట్ విద్యార్థులకు గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు సూచన



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాసరావు

రంపచోడవరం: డైట్ కళాశాల విద్యార్థులు భవిష్యత్తులో విద్యార్థులకు మంచి బోధన అందించాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ సీహెచ్ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక డైట్ కళాశాల (డీఎడ్ కళాశాల)లో బుధవారం ఆర్ట్ ఎడ్యుకేషన్, పని అనుభవం మేళాను ఆయన ప్రారంభించారు. డైట్ కళాశాల విద్యార్థుల నమూనాలను తిలకించారు.

జగనన్న విద్యాదీవెనలో రూ.5.13 కోట్ల లబ్ధి

- 12,939 విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- విద్యకు అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



జగనన్న విద్యాదీవెన చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: పేదపిల్లల చదువులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేస్తున్నారని, జగనన్న విద్యా దీవెన పథకంలో జిల్లాలో 12,939 మంది విద్యార్థులకు రూ.5.13 కోట్ల మేర లబ్ధి చేకూరినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి జగనన్న విద్యాదీవెన నిధులను బటన్ నొక్కి బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేశారు.ఐటీడీఏ సమావేశ మందిరంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్‌తో పాటు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పలుశాఖల అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదపిల్లలకు చదువులు ఆగకూడదనే మంచి ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జిల్లాలో అర్హులైన 97శాతం మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలను ప్రభుత్వం ఆమలుజేస్తోందన్నారు. మూడుశాతం మంది విద్యార్థులకు నగదు జమలో సాంకేతిక సమస్యలు నెలకొన్నాయన్నారు. వారంతా గ్రామ సచివాలయాల వద్ద ఆయా సమస్యలను పరిష్కరించుకోవాలని, సచివాలయ ఉద్యోగులు అన్ని విధాలా సహకరిస్తారని ఆయన తెలిపారు. జగనన్న విద్యాదీవెన నగదు తల్లుల ఖాతాల్లో జమ అయినందున వెంటనే ఆయా కళాశాలలకు ఫీజులు చెల్లించాలని, విద్యార్థులు ఉన్నత చదువుల లక్ష్యంతో సాగాలని కలెక్టర్ సూచించారు.

విద్యకు సీఎం అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విద్యకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గడచిన మూడున్నర ఏళ్లలో విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.30కోట్ల 45లక్షల 76వేలు ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించిందన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, మనబడి నాడు–నేడు కార్యక్రమాలను సీఎం ప్రతిష్టాత్మకంగా ఆమలుజేస్తున్నారని ఆమె తెలిపారు.అనంతరం విద్యార్థులు,వారి తల్లులకు జగనన్న విద్యాదీవెన చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో డాక్టర్ పి.రమేష్, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు అవసరం



కొత్తాబులో పెన్సిల్‌తో వేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్రాన్ని ఆయనకు అందజేస్తున్న విద్యార్థులు



బర్సింగిలో మరమ్మతులు చేపట్టిన పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

- విద్యార్థులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచన
- ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో కలిసి గిరిజన గ్రామాల సందర్శన

పాడేరు రూరల్ : గిరిజన విద్యార్థులంతా ప్రాథమిక దశ నుంచి అంగ్ల భాషపై పట్టు సాధించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మితో కలిసి బుధవారం ఆయన మండలంలోని కొత్తాబు, బర్సింగి, డోకులూరు, బొడ్డుమామిడి గ్రామాలను సందర్శించారు. ముందుగా కొత్తాబు గ్రామంలో కలెక్టర్ నిధులు రూ.1.50 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.1.50లక్షలతో కలిపి గ్రామస్తుల శ్రమదానంతో పునర్మించిన పాఠశాల, అంగన్‌వాడీ భవనాలను వారు ప్రారంభించారు.

గ్రామంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఆరేళ్ల చిన్నారి సీదరి దీక్షితకు నిలిచిపోయిన పింఛనును పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. బర్సింగి గ్రామంలో రూ.2.50లక్షలతో గ్రామస్తుల శ్రమధానంతో పునర్నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని వారు ప్రారంభించారు. భవనానికి గేటు ఏర్పాటుకు కలెక్టర్ హామీ ఇచ్చారు. డోకులూరు గ్రామంలో రూ.130లక్షలతో మరమ్మత్తులు చేపట్టిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. డోకులూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి మొక్కలు నాటారు. మండలంలో మరమ్మతులకు గురైన పాఠశాల భవానల వివరాలు అందజేయాలని ఎంపీడీవో సాయి నవీన్‌ను ఆదేశించారు.

బొడ్డుమామిడిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన రూ.3లక్షల నిధులతో చేపట్టనున్న రహదారి నిర్మాణానికి కలెక్టర్, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచ్ సీదరి రాంబాబు విజ్ఞప్తి మేరకు బొడ్డుమామిడి గ్రామం నుంచి ప్రధాన రహదారికి కలిపేలా మిషన్ కనెక్ట్ పాడేరు కింద మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్‌లు బొ. చిట్టిబాబు, కుశ్రబోయిన సన్నిబాబు, గొల్లోరి నీలకంఠం, వంతాల రాంబాబు, లకే పార్వతమ్మ, వైస్ ఎంపీపీ కె. కనకలమ్మ, ఎంపీటీసీలు దూసూరి సన్యాసిరావు, చిట్టమ్మ, మాజీ ఎంపీపీలు ఎస్వీవీ రమణమూర్తి, సీదరి మంగ్లన్నదొర, ఎంఈవో సరస్వతి పాల్గొన్నారు.

ముగ్ధుడైన కలెక్టర్

విద్యార్థుల ప్రతిభకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ముగ్ధుడయ్యారు. కొత్తాబు పాఠశాలలో గిరిజన విద్యార్థి కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్రపటాన్ని పెన్సిల్‌తో వేసి అందజేశాడు. వెంటనే ఆ విద్యార్థిని కలెక్టర్ దగ్గరకు తీసుకుని అభినందించారు. బర్సింగి పాఠశాలలో కూడా మరికొంతమంది విద్యార్థులు పెన్సిల్‌లో వేసిన చిత్రాలను కలెక్టర్‌కు అందజేశారు.

పీఎల్‌జీఏ వారోత్సవాలను అడ్డుకుంటాం

- బలగాలు అప్రమత్తం
- పోలీసు పార్టీలతో గాలింపు
- ప్రజాప్రతినిధులు మారుమూల ప్రాంతాలకు వెళ్లొద్దు
- ఎస్పీ సతీష్‌కుమార్



సాక్షి,పాడేరు: మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలను అడ్డుకునేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసు బలగాలను అప్రమత్తం చేశామని, ప్రత్యేక పార్టీలు ఇప్పటికే కూంబింగ్‌లో నిమగ్నమయ్యాయని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన సాక్షితో మాట్లాడుతూ మావోయిస్టుల ప్రాబల్యం గతంలో కంటే తగ్గినప్పటికీ, వారోత్సవాల పిలుపుతో జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్ల యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. మావోయిస్టుల కార్యకలాపాలను నియంత్రించే లక్ష్యంగానే పోలీసు బలగాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసు బలగాలతో తమ పోలీసులు బృందాలు సమన్వయం చేసుకుంటూ ఏవోబీలో గాలింపు చర్యలు చేపడుతున్నాయని ప్రధాన జంక్షన్లు, రోడ్లు, మండల కేంద్రాల్లో వాహనాల తనిఖీలకు ప్రత్యేక పోలీసు పార్టీలు నిరంతరం పనిచే స్తున్నాయన్నారు. మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు ముగిసేంతవరకు ప్రజాప్రతినిధులు, హిట్‌లిస్ట్‌లో ఉన్న నేతలు మారుమూల ప్రాంతాల పర్యటనలను రద్దు చేసుకోవాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఎస్పీ సూచించారు.

హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటాలు

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు

పాడేరు రూరల్ : హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తోందన్నారు. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో కార్మికులపై మరింత దోపిడీ పెరుగుతోందన్నారు. కార్మికులకు అత్యంత ప్రధానమైన కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమాన వేతనం కోసం వేతన సలహా బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి లింగేరి సుందరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



విద్యార్థులతో మాట్లాడుతున్న జమాల్‌బాషా

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని గిరిజన విద్యాలయాల్లోను విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా తెలిపారు. స్థానిక లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఇక్కడ సిక్‌రూమ్‌లో గిరిజన విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వారికి అందించిన వైద్యసేవలపై సమీక్షించారు. టైఫాయిడ్‌తో ఐదుగురు, కడుపు నొప్పి, వాంతుల లక్షణాలతో మరో 10 మంది విద్యార్థులు బాధపడుతున్నారు. వీరికి మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వంటగదిని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాలు, ఇతర పౌష్టికాహారంపై సమీక్షించారు. సీజనల్ వ్యాధులపై పాఠశాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన ఆహారంతో పాటు, విద్యార్థులకు కాచి చల్లార్చిన సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. ఇక్కడ విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తాగునీటికి పరీక్షలు నిర్వహించాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను డీఎంహెచ్‌వో ఆదేశించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ప్రభావతి, వైద్యులు పాల్గొన్నారు.

చలిగాలుల విజృంభణ

లంబసింగిలో కురుస్తున్న మంచు



సాక్షి,పాడేరు: మన్యంలో చలిగాలులు విజృంభిస్తున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతుండడంతో ప్రజలు చలితో ఇబ్బందులు పడుతున్నారు. పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో బుధవారం ఉదయం 10 గంటల వరకు మన్యాన్ని మంచు తెరలు కమ్ముకున్నాయి. పాడేరు తదితర ప్రాంతాల్లో ప్రజలు ఉదయాన్నే చలిమంటలను ఆశ్రయించారు. సాయంత్రం 4గంటల నుంచి చలిగాలులు అధికమయ్యాయి. బుధవారం పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డులో 11 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 11.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

లంబసింగిని కమ్మేసిన మంచు

చింతపల్లి : మండలంలో చలి విజృంభిస్తోంది. మంచు అదేస్థాయిలో కురుస్తోంది. బుధవారం . చలి తీవ్రత పెరగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పర్యాటక ప్రాంతమైన లంబసింగిలో ఉదయం 10 గంటల వరకు దట్టంగా పొగమంచు కురిసింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో 10.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఏడీఆర్ సురేష్ కుమార్ తెలిపారు

క్లుప్తంగా

ఏడు తులాల బంగారు నగల చోరీ

మునగపాక : నాగులాపల్లిలో 7 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు మునగపాక పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. నాగులాపల్లికి చెందిన ఆంధ్రస్వాతి తన బంగారు ఆభరణాలను బీరువాలో ఉంచింది. ఆదివారం బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు మంగళవారం సాయంత్రం చూసేసరికి కనిపించకపోవడంతో ఆందోళనకు గురై ఇళ్లంతా వెతికింది. ఫలితం లేకపోవడంతో బుధవారం ఉదయం మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్ఐ చల్లా భీమరాజు సంఘటనా స్థలానికి చేరుకొని బీరువా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్ కూడా సంఘటన స్థలాన్ని పరిశీలించింది. దర్యాప్తు జరుగుతోంది.

ఏజెన్సీలో హెచ్ఐవీ నియంత్రణకు కృషి

- జిల్లా టీబీ, హెచ్ఐవీ నియంత్రణ అధికారి విశ్వేశ్వరనాయుడు
- రెండున జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు



సాక్షి, పాడేరు: ఏజెన్సీలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలకు వైద్య బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయని జిల్లా క్షయ, హెచ్ఐవీ నియంత్రణ అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వరనాయుడు తెలిపారు. జిల్లా ఆస్పత్రి, ప్రాంతీయ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఐసీటీఎస్ కేంద్రాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గర్భిణి దశలోనే పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఆమె భర్తకు కూడా పరీక్ష తప్పనిసరి చేశామని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం పాడేరు డివిజన్ పరిధిలో 492 హెచ్ఐవీ పాజిటివ్ కేసులు గుర్తించినట్టు చెప్పారు. వీరందరికీ ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా వైద్య ఆరోగ్య కార్యక్రమాలు అమలుజేస్తున్నామని చెప్పారు. ఈనెల 2న ప్రపంచ హెచ్ఐవీ, ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని పాడేరుతో పాటు, అన్ని పీహెచ్‌సీల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- ప్రమాదంగా జోలాపుట్టు వంతెన
- తుప్పు పట్టడంతో రంధ్రాలు
- భయం భయంగా రాకపోకలు

ముంచంగిపుట్టు: ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు వద్ద ద్విచక్ర వాహనాలు, కాలినడకన రాకపోకలకు వీలుగా నిర్మించిన తాత్కాలిక ఐరెన్ వంతెన ప్రమాదభరితంగా మారింది. దీంతో ఐరెన్ వంతెనపై రాకపోకలు చేసేందుకు సరిహద్దు ప్రజలు నిత్యం భయపడుతున్నారు. 2006 సంవత్సరంలో జోలాపుట్టు జలాశయం నీటి మట్టం పెరిగి నీటి స్థాయి ప్రమాదకరంగా మారడంతో జలాశయ గేట్లు తెరవడం ఆ నీటి ఉధృతకు దిగువనున్న సరిహద్దు వంతెన కొట్టుకుపోయింది. దీంతో తాత్కాలికంగా కొన్ని సంవత్సరాలు పాటు కర్రల వంతెనను ఏర్పాటు చేసి అనంతరం ఐరెన్ వంతెనను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ద్విచక్రవాహనాలు, పాదచారులు ప్రయాణాలు చేస్తూ వచ్చారు. 2014 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎంపీ కిషోర్‌చంద్రదేవ్ సరిహద్దు వంతెన నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు చేశారు. పనులు ప్రారంభమై పునాది స్థాయిలోనే నిలిచిపోయాయి. దీంతో నేటి వరకు సరిహద్దు గిరిజనులకు వంతెన దిక్కుగా మారింది. ప్రస్తుతం ఐరెన్ వంతెన పైభాగం తుప్పు పట్టడంతో చిన్న చిన్న రంధ్రాలు ఏర్పడ్డాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సరిహద్దు ప్రజలు భయం భయంగా రాకపోకలు చేస్తూ వస్తున్నారు. ఇటీవల ఐరెన్ వంతెన దాటుతూ ఒడిశాకు చెందిన కవిత హంతాల అనే గర్భిణి మహిళ పడిపోయి అబార్షన్ సైతం అయింది. రోజూ వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్న వంతెన సమస్యను ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు, జెన్‌కో అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతు చేసి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడిన వంతెన పైభాగాన్ని చూపుతున్న జోలాపుట్టు గ్రామస్తులు

కాఫీ రైతులు లాభపడేలా చర్యలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు : కాఫీ రైతులు లాభ పడేలా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చూడాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో హుకుంపేట మండలంలో కాఫీ అమ్మకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాఫీ లైజన్ వర్కర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్ర స్థాయిలో పర్యటించి కాఫీ రైతులకు తగు సలహాలు, సూచనాలు అందజేయాలని సూచించారు. ధరలపై వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు లాభ పడేలా చూడాలని అవసరమైతే కొంత కాలం స్టాక్ ఉంచుకునేలా చూడటం వల్ల మంచి ధర ఉన్నప్పుడు అమ్ముకోవచ్చునన్నారు. కాఫీ పండు స్థాయిలో కిలో రూ.50, చెర్రి స్థాయిలో కిలో రూ.160, పార్చ్‌మెంట్ స్థాయిలో కిలో రూ.270కు తక్కువ కాకుండా విక్రయించేలా ప్రోత్సహించాలని సూచించారు. మధ్యవర్తులు, వర్తకులు, రైతులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. హుకుంపేట మండలం కాఫీ లైజన్ వర్కర్‌కు మండల పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయో తెలియకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పాడేరు, హుకుంపేట, చింతపల్లి, జీకే వీధి మండలాలకు ఒక అధికారి చొప్పున 10 నుంచి 15 మంది సీనియర్ అధికారులను నియమించాలని డీఆర్వో దయానిధిని ఆదేశించారు. వారికి కేటాయించిన గ్రామలలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ వి. అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ, కాఫీ బోర్డు డీడీ జయంతి ఘోష్, జిల్లా వ్యవశాయ అధికారి బీఎస్ నంద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమేష్‌కుమార్, కాఫీ ఏడీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో బుధవారం ఏపీవో సీహెచ్. శ్రీనివాసరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ విద్యార్థులకు తాజా ఆకు కూరలు, కూరగాయలు, మాంసం, పండ్లు, తదితర ఆహార పదార్థాలను సకాలంలో ఆశ్రమ, వసతి గృహాలకు చేరవేసే బాధ్యత కాంట్రాక్టర్‌దేనని చెప్పారు. గుడ్లు, చికెన్ అరటి పండ్ల సరఫరాకు మూడు నెలలకు ఒకసారి టెండర్లు ఆహ్వానిస్తామన్నారు. వార్డెన్‌లు నిత్యావసర సరకులకు సంబంధించి బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏజెన్సీలోని ప్రతి ఆశ్రమ పాఠశాలలో అధికారుల అనుమతులు లేకుండా ఎవర్ని లోపలికి అనుమతించవద్దన్నారు. కాంట్రాక్టర్ నాణ్యత లేని ఆహార పదార్థాలు, నిత్యావసర సరకులు సరఫరా చేస్తే తిరస్కరించాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఏటీడబ్ల్యూవో రామతులసి, హాసిని, జీసీసీ డీఎం పార్వతీశం, డీడీ కార్యాలయం సూపరింటెండెంట్ బి.కిషోర్, మేనేజర్లు రాజారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి పోటీలకు పెదబయలు విద్యార్థి నమూనా

- రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ పోటీలకు గిరిజన విద్యార్థి ఎంపిక

పెదబయలు: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ 2022లో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల-1 విద్యార్థి కె.మల్లేష్ రూపొందించిన నమూనా రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపికైంది. ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా ఉపాధ్యాయులు చెండా బాలకృష్ణ వ్యవహరించారు. విద్యార్థి మల్లేష్ జ్ఞాపిక, నగదు బహుమతిని డీఈవో డాక్టర్ రమేష్, జిల్లా డీఎస్‌వో టి.నాగేశ్వరరావు, సైన్స్ జిల్లా కోఆర్డినేటర్లు రమణమూర్తి, జానకి, రామారావుల చేతుల మీదుగా పాడేరులో జరిగిన కార్యక్రమంలో అందుకున్నాడు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

- నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

నాతవరం : రోడ్డు ప్రమాదాలు నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆయన బుధవారం నాతవరం పోలీసు స్టేషన్‌ను ఆకస్మాకంగా సందర్శించి, రికార్డులను పరిశీలించారు. మండలంలో గల ప్రధాన సమస్యలను ఎస్ఐ డి.లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నం తుని మధ్య అర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని నివారించేందుకు తరుచూ వాహనాలు తనిఖీలు చేస్తున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో సారా తయారీదారులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. బస్‌స్టాండ్లు, కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్‌కు పాల్పడేవారిపై చర్యల కోసం ప్రత్యేకంగా పోలీసు టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. వారు నిత్యం ప్రజల్లో తిరుగుతుంటారని ఎక్కడైనా ఆకతాయిలు కన్పిస్తే వారికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. చోరీ నివారణపై నిఘాకు ప్రధాన కూడళ్లు, వ్యాపార దుకాణాలు, బ్యాంకుల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా గంజాయి స్మగ్లింగ్‌పైనా నిఘా పెడతామన్నారు. స్టేషన్ పరిధిలో క్రైమ్ రేటు తగ్గే విధంగా ఎస్ఐలు పని చేయాలని అవగాహన కల్పిస్తున్నామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

వరి పంటకోత ప్రయోగంతో మంచి ఫలితాలు

అడ్డతీగల: అడ్డతీగల మండలం గొండోలు గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఎం.సువర్ణకుమారి ఆధ్వర్యంలో ఒక రైతు పొలంలో 5+5 మీటర్లు విస్తీర్ణంలో వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఇలా పంట కోత ప్రయోగం ద్వారా సేకరించిన ధాన్యాన్ని తూకం వేయగా 17.600 కిలోలు దిగుబడి వచ్చినట్టు ఏవో సువర్ణకుమారి తెలిపారు. పంటకోత ప్రయోగంతో మంచి ఫలితం వచ్చిందనానరు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని సమీపంలోని రైతు భరోసా కేంద్రం ద్వారా విక్రయించుకోవచ్చన్నారు. బయట ప్రైవేటు వ్యాపారులకు విక్రయించొద్దన్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరలను రైతులకు వివరించారు. వ్యవసాయ సహాయకులు వి.శ్రీను, అనిల్, కో-ఆర్డినేటర్ ఆనంద్, రైతులు పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగంలో వ్యవసాయ సిబ్బంది

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు

మాకవరపాలెం: గంజాయి తరలిస్తున్న ఒక యువకుడిని అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు స్థానిక బస్టాండు వద్ద బుధవారం తనిఖీలు చేపట్టగా కడపజిల్లా మైదుకూరు మండలానికి చెందిన గుండం రాజు రేవంత్(33) గంజాయి బ్యాగుతో పట్టుబడ్డాడన్నారు. అతడిని అరెస్టు చేసి బ్యాగులో ఉన్న నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రేవంత్‌ను కోర్టుకు అప్పగించామని తెలిపారు.

జనసేన కౌన్సిలర్‌పై కేసు నమోదు

నర్సీపట్నం : మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు జనసేన కౌన్సిలర్, నాయకులపై కేసు నమోదు చేశారు. సీఐ ఎన్.గణేష్ అందించిన వివరాలివి. వీడియో కాన్ఫరెన్స్ ఉండడంతో కమిషనర్ కౌన్సిల్ హాల్ నుంచి తన చాంబర్‌లోకి వెళ్లారు. వీడియో కాన్ఫరెన్స్ ముగించుకుని తన చాంబర్ నుంచి బయటకు వస్తుండగా అప్పటికే చాంబర్ ముందు బైఠాయించిన జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన సూర్యచంద్ర, టౌన్ అధ్యక్షుడు అద్దెపల్లి గణేష్, మరికొందరు తనను బయటకు రాకుండా బంధించి విధులకు ఆటంకం కలిగించారని కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు ముగ్గురితో పాటు మరి కొంత మందిపై కేసు నమోదు చేశామని సీఐ గణేష్ తెలిపారు. కాగా జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు మున్సిపల్ కమిషనర్ కె.కనకారావుపై కేసు నమోదు చేశారు. మున్సిపాలిటీ వాహనాల డీజిల్ అవకతవకలపై కమిషనర్ ఛాంబర్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టాగా కమిషనర్ చాంబర్ నుంచి బయటకు వచ్చి తనను కాలితో తోసి అగౌరవపరిచారని కౌన్సిలర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కమిషనర్‌పై కేసు నమోదు చేశామని సీఐ గణేష్ తెలిపారు.



కమిషనర్ కనకారావును కదలకుండా బంధించిన జనసేన కౌన్సిలర్, నాయకులు

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

నర్సీపట్నం : ప్రమాదవశాత్తూ ఇంటిపై నుండి పడి గాయపడిన వ్యక్తి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. టౌన్ ఎస్ఐ గోవిందరావు తెలిపిన వివరాలు ఇలావున్నాయి. మున్సిపాలిటీ 4వ వార్డుకు కుమ్మరి వీధిలో నివాసం ఉంటున్న పడాల లక్ష్మణరావు(48) నవంబర్ 28వ తేదీన మేడపై కూర్చున్నాడు. ఆ సమయంలో ఫిట్స్ రావడంతో కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం తగలడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 14 మంది ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

అచ్యుతాపురం(అనకాపల్లి): రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని నునపర్తిలో గల శ్రీరామా బాల్‌బ్యాడ్మింటన్ వ్యాయామ క్లబ్‌కు చెందిన 14 మంది ఎంపికయ్యారు. ఇక్కడ శిక్షణ పొందిన వీరంతా నంబర్ 30న పరవాడ మండలం లేమర్తిలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలబాలికల అండర్-14, అండర్-17 విభాగాల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి విశాఖ జిల్లా జట్లకు ఎంపికయ్యారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అచ్యుతాపురం మండల బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు గొంప నర్సింహనాయుడు తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎ.శేఖర్, చీపురుపల్లి పీఈటీ అన్నాజీరావు, రమేష్‌నాయుడు, బి.అప్పలనాయుడు, క్రీడాకారులను అభినందించారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ



క్రీడా సామగ్రితో విద్యార్థినులు, సీఐ అశోక్‌కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ బీరేందర్

గూడెంకొత్తవీధి: మండలం కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలకు సీఆర్‌పీఎఫ్ 234వ బెటాలియన్ కంపెనీకి చెందిన అసిస్టెంట్ కమాండెంట్ బీరేందర్, గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్ తదితరులు బుధవారం క్రీడా సామగ్రిని అందజేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ కమాండంట్ సంజీవ్ ద్వివేది ఆదేశాల మేరకు పాఠశాలకు బ్యాడ్మింటన్ రాకెట్లు, క్యారంబోర్డు, వాలీబాల్ నెట్‌లు తదితర సామగ్రి అందజేసినట్టు వారు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు చదవుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించేందుకు కృషి చేయాలన్నారు.

ముంచంగిపుట్టు: మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 5న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఎంపీటీసీ, సర్పంచ్‌లు హాజరు కావాలని, శాఖల వారీగా అధికారులు పూర్తి సమాచారంతో విధిగా రావాలని, గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో కిరణ్‌కుమార్ చెప్పారు.

కాలనీల్లో ఇళ్లకు తక్షణమే విద్యుత్ కనెక్షన్

- 'గడపగడప.. వినతులకు తక్షణ పరిష్కారం
- ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న చీఫ్ సెక్రటరీ విజయానంద్

సీతమ్మధార(విశాఖ ఉత్తర): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ విద్యుత్ కనెక్షన్ అందించాలని రాష్ట్ర ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. గురుద్వార్ దరి కార్పొరేట్ కార్యాలయంలో ఈపీడీసీఎల్, ట్రాన్స్‌కో అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. తొలుత సంస్థ పనితీరు, ప్రగతికి సంబంధించి విశాఖ సర్కిల్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్పెషల్ చీఫ్ సెక్రటరీకి వివరించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా లే అవుట్లలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లకు విద్యుదీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వీధి దీపాలు, వాటర్ వర్క్స్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో విద్యుత్ సమస్యలపై వస్తున్న వినతులను తక్షణమే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులను విడుదల చేయాలని ఆదేశించారు. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాతో పాటు పరిశ్రమలు, గృహ వినియోగదారులకు 24/7 విద్యుత్ అందించాలని సూచించారు. సంస్థ పరిధిలో విద్యుత్ బకాయిల వసూళ్లకు అధికారులు ప్రాధాన్యమివ్వాలన్నారు. సమీక్షలో డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, సీజీఎంలు వి.విజయలలిత, సి.శ్రీనివాసమూర్తి, ఓ.సింహాద్రి, ఎ.వెంకటేశ్వరావు, జె.శ్రీనివాసరావు, బి.రామచంద్రప్రసాద్, ఎస్.మనిలామణి, ఎం,రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గిరి మహిళకు తీవ్ర గాయాలు

- బైక్ అదుపు తప్పడంతో ఘటన

అడ్డతీగల: మండలంలోని పైడిపుట్ట వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగవరం మండలం కొమరవరం గ్రామానికి చెందిన కంగల పార్వతికి తీవ్ర గాయాలయ్యాయి. కంగల బాలుదొర, భార్య పార్వతిని తీసుకుని అత్తగారి ఊరైన రాజవొమ్మంగి మండలం బోనంగిపాలెం బుధవారం ఉదయం మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి స్వగ్రామమైన కొమరవరం వెళ్తుండగా పైడిపుట్ట వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. దీంతో వెనుక కూర్చొన్న పార్వతి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరింది. బాలుదొరకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన పార్వతిని 108 వాహనంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. వైద్యులు ప్రసన్నదేవి, భాస్కర్ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై అపస్మారక స్థితికి చేరుకున్న కంగల పార్వతి

3 నుంచి 7 వరకు అప్పన్న ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు తిరుమంగై ఆళ్వారు తిరునక్షత్రం పూజలను పురస్కరించుకుని పలు ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సహస్రనామార్చన, స్వర్ణపుష్పార్చన, స్వర్ణ తులసీదర్శనం, గరుడసేవ, నిత్య కల్యాణం, నృసింహ హోమం సేవలను రద్దు చేశామన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు

చీడికాడ: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు స్థానిక కేజీబీవీ విద్యార్థినులు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ వి.భారతి తెలిపారు. అండర్-14,17,19 విభాగాల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. స్కూల్ గేమ్స్‌లో ఫెడరేషన్‌లో భాగంగా ఈ నెల 24న అనకాపల్లి ఏఎంఏల్ కాలేజీలో నిర్వహించిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో ఎస్.అరుణ, డి.ప్రభావతి, ముచ్చల కోవిల ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. వారిని చిన్నమ్మలు, సిబ్బంది అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్